సాక్షి తిరుపతి

శుక్రవారం । 8 । నవంబర్ । 2024



అఘోరీ కారు తనిఖీ

తడ నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయానికి వస్తున్న అఘోరీ కారును మార్గమధ్యంలో పోలీసులు తనిఖీ చేశారు. - 8లో



హాంఫట్

శ్రీకాళహస్తి మండలం, పోలి గ్రామ లెక్కదాఖలాలోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమిస్తున్నారు. - 8లో



అర్బన్ హెల్త్‌సెంటర్ల తనిఖీ

తిరుపతిలోని అర్బన్ హెల్త్ సెంటర్లను నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ప్రతినిధుల బృందం గురువారం తనిఖీ చేసింది. - 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి ఎస్వీయూలో యూత్ ఫెస్టివల్

హాజరు కానున్న 30 కళాశాలల విద్యార్థులు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో యువతరంగ్–24 పేరుతో మూడు రోజుల పాటు జరిగే ఇంటర్ కాలేజీగేట్ యూత్ ఫెస్టివల్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. వర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో శుక్రవారం ప్రారంభంకానున్న యూత్ ఫెస్టివల్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా వీసీ సీహెచ్ అప్పారావు మీడియాతో మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని సుమారు 30 కళాశాల నుంచి విద్యార్థులు యూత్ ఫెస్టివల్‌లో పాల్గొననున్నట్టు వెల్లడించారు. ఐదు విభాగాల్లో జరిగే యువజనోత్సవాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు చైన్నై ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ వేదికగా జరిగే సౌత్‌జోన్ పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. అందులోనూ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు 300మంది విద్యార్థులు యూత్ ఫెస్టివల్‌లో పాల్గొనున్నట్టు తెలిపారు. అనంతరం యూత్ ఫెస్టివల్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రొఫెసర్ దామోదర్‌రెడ్డి, ప్రసాద్, ఆర్గనైజర్లు డాక్టర్ జే.కళ్యాణ్‌కుమార్, డాక్టర్ పత్తిపాటివివేక్ పాల్గొన్నారు.

నాలుగు నెలలకు ఒక ఉచిత సిలిండర్



జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: నాలుగు నెలలకు ఒకసారి మాత్రమే దీపం–2 పథకం ద్వారా ఉచిత సిలిండర్ వర్తిస్తుందని జేసీ శుభం బన్సల్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏడాదిలో మూడు సిలిండర్లు మాత్రమే ఉచితంగా అందుతాయన్నారు. లబ్ధిదారులు సిలిండర్ బుకింగ్ అనంతరం నగదు చెల్లించాలని చెప్పారు. తర్వాత 48 గంటల్లోపు మీ బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేస్తారని వెల్లడించారు. ఏడాదిలో నాలుగు నెలలకు ఒకటి చొప్పున మూడు ఉచిత సిలిండర్లు పొందడానికి ప్రధానంగా ఆధార్ కార్డుతో పాటు తెల్లరేషన్‌కార్డు, బ్యాంక్ పుస్తకం, ఎల్‌పీజీ కనెక్షన్ ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 6.03 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. ఏదైనా సమస్యలుంటే 1967కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఈకేవైసీ చేయించుకోవడానికి లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళితే వారు బలవంతంగా గ్యాస్ పైపులు, రెగ్యులేటర్, స్టౌ తదితర వస్తువులు కట్టబెట్టి నగదు వసూలు చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శేషాచలం రాజు పాల్గొన్నారు.

తిరుమలలో నలభై బయోగ్యాస్ ప్లాంట్లు



కరకంబాడి రోడ్డులో శంఖుస్థాపన చేస్తున్న..

తిరుపతి మంగళం: తిరుమలలో నలభై టీటీడీ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు సుస్థిర ఇంధనం కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), టీటీడీ చేతులు కలిపాయి. వీరి సంయుక్త ఆధ్వర్యంలో స్థిరమైన శక్తి ఉత్పత్తి, సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు తిరుమలలో బయోగ్యాస్ ప్లాంట్‌కు భూమి పూజ, శంకుస్థాపన చేపట్టారు. కార్యక్రమంలో ఐఆర్ఎస్, టీటీడీ అడిషనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సీ.వెంకయ్యచౌదరి, (ఐఓసీఎల్ హైదరాబాద్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, స్టేట్ హెడ్ బీ.అనిల్‌కుమార్, ఇతర టీటీడీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్–మార్కెటింగ్ వీ.సతీష్‌కుమార్ టీటీడీకి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తిరుపతిలోని కరకంబాడి రోడ్డులో కొత్త ఐఓసీఎల్ డివిజనల్ కార్యాలయ భవనానికి గురువారం భూమి పూజ చేశారు. తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, తుడా వీసీ, టీటీడీ, ఐఓసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 9 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండాయి. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 9 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆమెది మూగ ప్రేమ!





బీవీఎస్సీ కోర్సులో అడ్మిషన్ల వివరాలు

సంవత్సరం	మొత్తం సీట్లు	పురుషులు	మహిళలు
2020	85	35	50
2021	85	31	54
2022	88	29	59
2023	85	32	53
2024	90	33	57

మూగజీవులపై మక్కువ పెంచుకుంటున్నారు. వాటి సంరక్షణ కోసం ఏకంగా డాక్టర్ వృత్తినే ఎంచుకుంటున్నారు. కఠోరమైన సాధన చేసి నీట్‌లో ర్యాంకులు సాధించి మరీ పశువైద్య కోర్సుల్లో చేరుతున్నారు. పట్టుదలతో పీజీ కోర్సులూ పూర్తిచేసి తమకిష్టమైన వృత్తిలో స్థిరపడుతున్నారు. పురుషాధిక్యత కొనసాగే పశువైద్య కోర్సుల్లో మరింతగా 'రాణి'స్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

- వెటర్నరీ బీవీఎస్సీ కోర్సుల ప్రవేశాలలో మహిళలే టాప్
- ఏటా పురుషులకంటే 30శాతం అధికంగా అడ్మిషన్లు
- పశువైద్యులుగా రాణిస్తామంటున్న విద్యార్థినులు


తిరుపతి సిటీ: ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థినులు పశువైద్య విద్యపై మక్కువ చూపుతున్నారు. తిరుపతి ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని పశువైద్య కళాశాలలో ప్రతి ఏటా బ్యాచులర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ కోర్సులలో అధిక సంఖ్యలో అడ్మిషన్లు పొందుతున్నారు. 2010వరకు వెటర్నరీ డాక్టర్లు, పశువైద్య విద్యను అభ్యసించే వారిలో పురుషులు అధిక సంఖ్యలో ఉండేవారు. 2011 నుంచి వెటర్నరీ కోర్సులలో మహిళలు పెద్ద సంఖ్యలో ప్రవేశాలు పొందుతూ వస్తున్నారు. కోర్సు పూర్తి చేసి, దేశవిదేశాలలో వెటర్నరీ డాక్టర్లుగానూ, పరిశోధక వృత్తుల్లోనూ, అధ్యాపకులుగా స్థిరపడుతున్నారు.

మహానేత పుణ్యం.. మహిళలకు వరం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి 2006లో శ్రీ వేంకటేశ్వరా వెటర్నరీ యూనివర్సిటీని నెలకొల్పారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పశువైద్యకోర్సులు ప్రవేశపెట్టారు. దీంతో ఒక్కసారిగా వెటర్నరీ వైద్య విద్యకు డిమాండ్ పెరిగింది. ప్రవేశాల కోసం తీవ్ర స్థాయిలో పోటీ నెలకొంది. నీట్ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల మెరిట్ ఆధారంగా ఇందులో ప్రవేశాలు కల్పిస్తారు.

ఏటా 85 సీట్లు భర్తీ

ఎస్వీ వెటర్నరీ కళాశాలలో ఏటా కొత్తగా 85 సీట్లను భర్తీ చేస్తున్నారు. ఇందులో సుమారు 50 నుంచి 60 మంది విద్యార్థినులే బీవీఎస్సీలో ప్రవేశాలు పొందుతున్నారు. మూగ జీవులకు సేవ చేయాలనే తమ కలను నెరవేర్చుకుంటున్నారు. పురుషులతో పోటీపడి పశువైద్య రంగంలో రాణిస్తున్నారు. కోర్సు పూర్తయ్యాక కొందరు సొంతంగా క్లినిక్‌లు నడుపుతుండగా.. మరికొందరు విదేశాల్లో స్థిరపడుతున్నారు.



ఎస్వీ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ ముఖద్వారం

మహిళలదే హవా



పశువైద్య కళాశాలలో బీవీఎస్సీ, ఎమ్‌వీఎస్సీ పీజీ, యూజీ కోర్సులలో గత కొన్నేళ్ల నుంచి అధిక సంఖ్యలో మహిళలు అడ్మిషన్లు పొందుతున్నారు. సుమారు 65 నుంచి 70 శాతం మేర ప్రతి ఏడాదీ విద్యార్థినులు పశువైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ఎస్వీ వెటర్నరీ కళాశాలలో పీజీ, యూజీ కోర్సులు పూర్తి చేసిన మహిళలు విదేశాల్లో ఉద్యోగాలు పొందారు. కళాశాలలో నాణ్యమైన బోధన, ఫ్యాకల్టీ, హాస్టల్ వసతి వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ పీ.జానకిరామయ్య, అసోసియేట్ డీన్, ఎస్వీ వెటర్నరీ కళాశాల, తిరుపతి

మూగజీవాలంటే ప్రాణం



మాది కృష్ణా జిల్లా గుడివాడ. నాన్న వృత్తి రీత్యా ఆటోమొబైల్ ఎలక్ట్రీషియన్. నాకు వైద్య వృత్తి అంటే చాలా ఇష్టం. నాకు పెట్స్ అంటే చిన్నప్పటి నుంచి పిచ్చి. గతంలో వెటర్నరీ డాక్టర్లుగా కేవలం పురుషులు అధిక సంఖ్యలో ఉండేవారు. ప్రస్తుతం పురుషులకంటే మహిళలే ఎక్కువగా రాణిస్తున్నారు. నీట్ పరీక్షలో ర్యాంకు సాధించి ఎస్వీ వెటర్నరీ కళాశాలలో సీటు సాధించాను. భవిష్యత్‌లో పీజీ పూర్తి చేసి పరిశోధన రంగంలో అడుగుపెట్టాలని ఉంది.

–జే.కావ్యశ్రీ, బీవీఎస్సీ విద్యార్థిని, తిరుపతి

అదే నా ఆకాంక్ష



మాది బాపట్ల జిల్లా అద్దంకి గ్రామం. నాన్న మెకానిక్. వైద్య విద్య చదవాలనే ఆకాంక్ష చిన్నప్పటి నుంచి బలంగా ఉండేది. తిరుపతి వెటర్నరీ కళాశాలలో సీటు సాధించి అడ్మిషన్ పొందాను. శతకోటి జీవరాశులలో మానవులతో సమానమైన మూగజీవాలకు వైద్యం చేసి వాటికి ప్రాణాలు పోసే విద్యను అభ్యసించడం గర్వంగా ఉంది. యూజీలోనూ అత్యధిక సంఖ్యలో మహిళలు పశువైద్య విద్యను అభ్యసిస్తున్నారు.

–టీ.అమూల్య, వెటర్నరీ యూజీ విద్యార్థిని, తిరుపతి

పశువైద్యులకు డిమాండ్



మాది శ్రీకాకుళం. నాన్న రైల్వే ఉద్యోగి. అమ్మ గృహిణి. పెట్స్ పెంచుకోవడం ఇంట్లో అందరికీ హాబీ. జంతువులు అనారోగ్యానికి గురైతే వ్యాధిని గుర్తించడం వైద్యులకే సాధ్యం. ఆధునిక సమాజంలో పెంపుడు జంతువులు లేని గృహం లేదంటే అతిశయోక్తి కాదేమో. దీంతో పశువైద్యులకు డిమాండ్ పెరిగింది. వెటర్నరీలో పీజీ, యూజీ, పీహెచ్‌డీ చేసిన అభ్యర్థులు 100శాతం ఉపాధి, ఉద్యోగాలు సాధించారు. అందుకే నేను ఈ రంగాన్ని ఎంపిక చేసుకున్నా.

–ఎం.భావన, బీవీఎస్సీ విద్యార్థిని, తిరుపతి

తీరంలో భారీ వర్షం



పెరుగుతున్న అలల ఉధృతి

వాకాడు : వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా మండలంలో భారీ వర్షం పడుతోంది. వాకాడు మండలం, తూపిలిపాళెం సముద్ర తీరంలో గురువారం భారీ వర్షంతో పాటు చలి గాలులు వీశాయి. ఫలితంగా సముద్రంలో అలల ఉధృతి క్రమేణీ పెరిగింది. సముద్ర తీరంలో ఉదయం కనిపించిన అలల తీవ్రత కన్నా సాయంత్రం మరింత పెరిగాయని స్థానిక మత్స్యకారులు తెలిపారు. అధికారుల నుంచి తమకు ఎలాంటి సమాచారం లేకున్నా కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని ముందుస్తు జాగ్రత్తగా గ్రామ పెద్దల ఆదేశాలతో వేట నిలిపేసినట్టు వెల్లడించారు.

నేటి నుంచి జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ, భావనా ప్రియ సాహితీ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు వర్సిటీలోని చెలికాని అన్నారావు సభా మందిరంలో తెలుగు సాహిత్యం, రచనలు, ఆవిష్కరణలు, అష్టావధానం వంటి విషయాలపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఆసక్తిగల సాహితీ ప్రియులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

రొయ్యల కంపెనీపై ఐటీ దాడులు

కోట: మండలంలోని ఓ రొయ్యల కంపెనీపై ఐటీ శాఖ గురువారం దాడులు నిర్వహించింది. రొయ్యల కంపెనీ ఏర్పాటు చేసిన సంస్థకు రాష్ట్ర వ్యాప్తంగా బ్రాంచ్‌లు ఉన్నాయి. 11 చోట్ల ఏకకాలంలో దాడులు చేపట్టినట్లు సమాచారం. ఐటీ దాడులకు సంబంధించిన సమాచారాన్ని అధికారులు ఎవరూ బయటకు రానీయకుండా జాగ్రత్తపడ్డారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సాధారణ సమావేశం రసాభాసగా సాగింది. కౌన్సిల్‌లో మెజారిటీ సభ్యుల ఆమోదం లేకుండానే తీసుకున్న నిర్ణయాలను వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ నుంచి గత ఎన్నికల్లో ప్రలోభాలకు గురై కూటమికి మద్దతు పలికిన కార్పొరేటర్లు అడుగడుగునా అడ్డు తగిలే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మేయర్ శిరీష, కమిషనర్ సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వారు వినిపించుకోకపోవడం విమర్శలకు తావిచ్చింది.



ఎజెండాలో అంశాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

- అడ్డగోలు నిర్ణయాలను వ్యతిరేకించిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు
- స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నిక నిర్వహించకపోవడంపై మండిపాటు
- నోరు జారిన కమిషనర్, 48వ డివిజన్ కార్పొరేటర్

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్లో నిర్వహించారు. నగర మేయర్ డాక్టర్ ఆర్.శిరీష అధ్యక్షతన నిర్వహించిన ఈ కౌన్సిల్ సమావేశంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. మొత్తం 15 అజెండాలను కౌన్సిల్ ముందు కమిషనర్ మౌర్య ప్రవేశపెట్టారు. ఒక్కొక్క అజెండాను కార్పొరేషన్ సెక్రటరీ రాధిక ప్రవేశపెట్టారు. స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికలను నిర్వహించకపోవడం పట్ల వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఎస్కే బాబు, ఆరణి సంధ్య, సుజాత అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించను కమిషనర్ మూడేళ్లుగా ఎన్నికలు నిర్వహించనప్పుడు ఎందుకు అడగలేదని నోరు జారారు. ఈ విషయంపై జోక్యం చేసుకున్న మరో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు రికార్డులు పరిశీలించకుండా కమిషనర్ అలా చెప్పడం సరికాదని హితవుపలికారు. 48వ డివిజన్ కార్పొరేటర్ అన్న అనిత మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆయన తనయుడు భూమన అభినయరెడ్డి అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు చేశారు. దీన్ని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ముక్తకంఠంతో ఖండించారు.

అందరూ కలసి కట్టుగా పనిచేద్దాం

తిరుపతి నగరాభివృద్ధికి రాజకీయ నాయకులు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కార్పొరేటర్లు, అధికారులకు పిలుపునిచ్చారు. ఆర్థిక వనరులను సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నగరపాలక సంస్థలో కార్పొరేటర్లు కూర్చునేందుకు హాలు ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు తెలిపామన్నారు. నగరంలో ఉన్న పార్కుల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి మరుగుదొడ్లు, నీటి సౌకర్యం కల్పించి, వాకింగ్ ట్రాక్ మరమ్మతులు చేయాలన్నారు. టీడీఆర్ బాండ్లకు పెద్ద సంఖ్యలో బాధితులు వస్తున్నారని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు.

అభివృద్ధే అజెండా



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్లు

మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధి మన అజెండాగా ముందుకుసాగాలన్నారు. అర్ధరహిత చర్చలు వద్దని హితవు పలికారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ తిరుపతిలో జరిగే అభివృద్ధి అందరికీ ఆదర్శం కావాలన్నారు. నగరంలో కూరగాయల మార్కెట్‌కు వెళ్తే ఎక్కడపడితే అక్కడ షాప్‌లు పెట్టడంతో అపరిశుభ్రంగా ఉందని, దీన్ని సరి చేయాలని చెప్పారు. హోటల్స్‌లో ఆహార పదార్థాలు సరిగా ఉండడం లేదని, అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, ఇతర కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధి 20 ఏళ్లు ముందుకు

మెజారిటీ కార్పొరేటర్లు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో భూమన కుటుంబం చేసిన అభివృద్ధితో తిరుపతి నగరం మరో 20 ఏళ్ల ముందుకు వెళ్లిందని గుర్తుచేశారు. ఆ స్థాయిలో కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి చేసే దమ్ముందా..? అని నిలదీశారు. స్టాండింగ్ కౌన్సిల్ ఫర్ లా నియామకాన్ని కౌన్సిల్ మెజారిటీ సభ్యుల ఆమోదం లేకుండా ఎలా నియమిస్తారంటూ కార్పొరేటర్ ఆరణి సంధ్య, సుజాతా నిలదీశారు. ఎజెండాలోని 14వ అంశాన్ని మెజారిటీ కార్పొరేటర్లు అంతా తీవ్రంగా వ్యతిరేకించారు. స్టాండింగ్ కౌన్సిల్ కోసం నియమించిన తమిదలపాటి దినకర్ ఎంపిక పట్ల కౌన్సిల్‌కు ఏమాత్రం అంగీకారం కాదని నినదించారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా చేసిన ఈ ప్రక్రియను తక్షణం నిలుపుదల చేయాలని హెచ్చరించారు. అడ్డగోల నిర్ణయాలను తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు.

అధికారం మాది.. మేము చెప్పిందే జరగాలి

టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ దూకుడుగా వ్యవహరించారు. ఇది మా ప్రభుత్వం, మేం చెప్పిందే జరగాలంటూ గట్టిగా వారించారు. ఐదారు మంది కార్పొరేటర్లతో కలిసి మిగిలిన కార్పొరేటర్లపై వాదనలకు దిగారు. రెండో డివిజన్ కార్పొరేటర్ ఉమా మాట్లాడుతూ అధికారుల్లో నిజాయితీ ఉంటే వెంటనే స్టాండింగ్ కమిటీ ఎన్నికలను నిర్వహించాలని సవాల్ విసిరారు. కౌన్సిల్లో తీసుకొన్న ప్రతి నిర్ణయానికీ మెజారిటీ సభ్యులు ఆమోదం పొందాలన్న విషయాన్ని విస్మరిస్తే గట్టిగా సమాధానం చెబుతామని ఆమె హెచ్చరించారు. కండలేరు నుంచి 7.4 కి.మీ పొడవుతో నిర్మిస్తున్న రెండవ పైప్ లైన్‌కు టీటీడీ నుంచి మరో ఐదు కోట్లు రావాల్సి ఉందని కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు.



వైఎస్సార్‌సీపీ కో ఆప్షన్ సభ్యుడు టీడీపీ కార్పొరేటర్ మధ్య వాగ్వాదం

దీనిపై మేయర్‌తో చర్చించి టేబుల్ అజెండగా ప్రవేశపెట్టారు. స్పందించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రభుత్వంతో చర్చించి రూ.5 కోట్లను వెంటనే విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

1,500 స్కూళ్లలో స్కౌట్స్ శాఖల ఏర్పాటు



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి కుమార్

తిరుపతి మంగళం : క్రమశిక్షణకు మారు పేరు స్కౌట్స్ అండ్ గైడ్స్ అని, ప్రతి పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తామని తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి కేవీకే. కుమార్ తెలిపారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి అర్బన్ మండలం మంగళంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, 2024–25 విద్యా సంవత్సరంలో జిల్లాలో 1,500 పాఠశాలల్లో స్కౌట్ శాఖల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇందులో ప్రధాన మంత్రి శ్రీ కింద తిరుపతి జిల్లాలో 40 పాఠశాలలకు రూ.50 వేల చొప్పున సమగ్ర శిక్షణ ఇవ్వడమే కాకుండా వారికి ప్రత్యేకంగా కార్యాచరణ, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో 2023–24కు గాను 568 యూనిట్లతో ప్రప్రథమ స్థానాన్ని పొందిందని, దీనిని నిలుపుకునేందుకు కార్యవర్గం నిబద్ధతతో కృషి చేయాలని కోరారు. దీనికి జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. స్వచ్ఛ భారత్‌తో పాటు క్రమశిక్షణ, పరిసరాల శుభ్రత, మొక్కలు నాటి సంరక్షించడం, ప్లాస్టిక్ వాడకం తగ్గించడంపై విద్యార్థులు స్కౌట్, గైడ్స్‌గా చేరి అన్నింటా అవగాహన పెంచుకుని పాఠశాల, వ్యక్తిగత అభివృద్ధికి కృషి చేయాలని తిరుపతి జిల్లా ఉప విద్యాధికారి బాలాజి కోరారు. జిల్లా వయోజన వనరుల కమిషనర్ ఎంఎం రెడ్డి, జిల్లా కార్యదర్శి జయరాం, నిర్వాహక కమిషనర్ కోటేశ్వరరావు, జిల్లా కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబు, శిక్షణా కమిషనర్ వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు, స్కౌట్ మాస్టర్స్, మునిరత్నం, వెంకటేశు, రామకృష్ణ, వేంకటాద్రి, మురళి, హేమకుమార్, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మీ సేవలు అభినందనీయం

వెంకటగిరి రూరల్: వెంకటగిరిలోని టీవీఎస్ మోటారు సైకిల్ అనుబంధంగా శ్రీనివాసన్ సేవా సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మండలంలోని గుండల సముద్రం గిరిజన కాలనీలో గురువారం శ్రీనివాస సేవా సంస్థ చైర్మన్ సర్వణ్‌సింగ్‌తో కలసి గిరిజనులకు ఇంటి నివాస ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గిరిజనులకు మౌలిక సదుపాయాల కల్పన దిశగా శ్రీనివాసన్ సేవా సంస్థ ముందుకు రావడం హర్షణీయమన్నారు. గిరిజనులకు మూడు సెంట్ల భూమిలో మూడు బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేసేందుకు అనువుగా ఉంటుందన్నారు. ఇంటిముందుర ఖాళీ స్థలం ఉంటే వాటిలో గొర్రెలు, మేకల పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు. శ్రీనివాసన్ సేవా సంస్థ చైర్మన్ స్వరణ్‌సింగ్ మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా వెంకటగిరిలో పాఠశాలలు, దేవాలయాలతోపాటు పలు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. గిరిజన కాలనీని తమ ట్రస్టు ద్వారా మోడరన్ గ్రామంగా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. అనంతరం గిరిజనులకు చేపల వలలు పంపిణీ చేశారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఎంపీపీ తనుజారెడ్డి, మత్స్యశాఖ అధికారి నాగరాజు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ రాంబాబు, పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ల తనిఖీ

తిరుపతి తుడా: తిరుపతిలోని అర్బన్ హెల్త్ సెంటర్ల పనితీరును, రోగులకు అందుతున్న వైద్య సేవలపై నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ మేరకు గురువారం తిరుపతిలోని ఎంఆర్ పల్లి, నెహ్రూ నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్లను తనిఖీ చేశారు. నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ సుశీల్, సభ్యులు డాక్టర్ రాజ్నితమర్, డాక్టర్ నేహ పరిశీలనలో పాల్గొన్నారు. నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ స్టేట్ నోడల్ ఆఫీసర్ తోపాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి పాల్గొన్నారు.

నీటితో నిండిన స్వర్ణ ముఖి నది(ఫైల్)



తిరుపతి జిల్లాకు తాగు, సాగునీటి వరప్రసాదిని స్వర్ణముఖి. నదీ పరివాహక ప్రాంతాల రైతులు, ప్రజలకు సాగు, తాగునీరు అందించాలన్న సత్సంకల్పంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బ్యారేజీ నిర్మాణానికి కృషి చేసింది. ఎన్నికల కోడ్, ప్రభుత్వ మార్పుతో ఆ పనులు ఆగాయి. అయితే ప్రస్తుత కూటమి సర్కారు ఆ బ్యారేజీ నిర్మాణంపై దృష్టి సారించి, అభివృద్ధి చేస్తే నదీ పరివాహక ప్రాంతం స్వర్ణమమై, సాగు, తాగు నీటి కొరత తీరుతుంది.

బ్యారేజీ నిర్మించాల్సిన ఆనకట్ట ప్రాంతం



అభివృద్ధి చెందితే స్వర్ణమే

- ప్రభుత్వ అలసత్వంతో బ్యారేజీ పనుల్లో జాప్యం
- నీరుగారుతున్న లక్ష్యం

శ్రీకాళహస్తి: స్వర్ణముఖి నది అభివృద్ధి 30 ఏళ్లుగా కాగితాలకే పరిమితమైంది. దీంతో నదిలో నీరు నిలవడం లేదు. నదిపై బ్యారేజీ నిర్మించి, అభివృద్ధి చేస్తే పరీవాహక ప్రాంతాల్లో సాగు, తాగు నీటి కొరత తీరుతుంది. భూగర్భ జలాలు కూడా పెరుగుతాయి. ఈ విషయాన్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర జలవనరుల శాఖ దృష్టికి స్వర్ణముఖి నది సమస్యను తీసుకెళ్లారు. అప్పటి కేంద్ర జలవనరులశాఖ మంత్రి గంజేంద్ర సింగ్ షెకావత్ గతంలో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చిన సమయంలో అయనకు స్వర్ణముఖి నది దుస్థితిని వివరించారు. దీనిపై స్పందించిన ఆయన జలవనరుల శాఖ ద్వారా జైకా నిధులు మంజూరు చేయించారు. ఎన్నికల ముందు పనుల నిర్వహణకు కేంద్ర జలవనరుల శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ పనులకు టెండరు పిలవడంతో ఆర్ఆర్ ఇన్‌ఫ్రా టెండర్ దక్కించుకుని, పునాది రాయి కూడా వేసింది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగాయి.

జిల్లాలోనే అతి పెద్ద నది

చంద్రగిరి సమీపంలోని శేషాచలంలో పుట్టిన స్వర్ణముఖి నది తొండవాడ సమీపంలో కల్యాణి, భీమా నదులతో సంగమించి జిల్లాలోనే అత్యంత పెద్ద నదిగా ఖ్యాతిని గడించింది. చంద్రగిరి, తిరుచానూరు, ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, పెళ్లకూరు, నాయుడుపేట, వాకాడు మండలాల్లోని తీర ప్రాంత రైతులకు సాగునీరు అందిస్తోంది.

నీలం సంజీవరెడ్డి కృషితో ఆనకట్ట

స్వర్ణముఖి నది ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా రైతులు ఎంతో లబ్ధి పొందుతున్నారు. ప్రత్యక్షంగా 25 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతోంది. నది నుంచి వృథా అయ్యే నీటికి అడ్డుకట్ట వేసి, రైతులకు సాగు నీరు అందించాలని నీలం సంజీవరెడ్డి హయాంలో ఆనకట్టను నిర్మించారు.

> **త్వరలో బ్యారేజీ పనులు ప్రారంభం**
>
> గత ప్రభుత్వంలోనే టెండర్ ప్రక్రియ పూర్తి అయ్యింది. ఆర్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ 9.9 శాతం లెస్‌తో టెండర్ దక్కించుకుంది. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత దానిపై కమిటీ వేసింది. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పనులు ప్రారంభం కాలేదు. తగ్గిన తర్వాత బ్యారేజీ నిర్మాణం ప్రారంభిస్తారు. ప్రాజెక్టు పూర్తి అయితే స్వర్ణముఖి పరీవాహక ప్రాంతాల్లో తాగునీటి కొరత తీరుతుంది. భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయి.
>
> – మదన్‌మోహన్, ఈఈ

కూటమి నిర్లక్ష్యం

గత ప్రభుత్వంలో టెండర్ దశ కూడా దాటిన స్వర్ణముఖి బ్యారేజీ నిర్మాణంపై నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలున్నాయి. టెండర్లు పూర్తయినా పనులు ప్రారంభించేందుకు మీన మేషాలు లెక్కపెడుతోంది.

దీని కుడి కాలువ ద్వారా చెంబేడు కాలువకు నీటిని మళ్లించి, 37 చెరువులకు అనుసంధానం చేశారు. దీంతో పది వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది.

కమిటీ పరిశీలన

నూతన ప్రభుత్వం ఏర్పడి నెలలు గడిచిపోతున్నా పనులు ఇంకా ప్రారంభం కాకపోవడం గమనార్హం. ఇందుకోసం ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ సభ్యులు దీనిపై అధ్యయనం చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. మొన్నటికి మొన్న ఇందుకోసం నియమించిన కమిటీ స్వర్ణముఖి నది ఆనకట్టను పరిశీలించి వెళ్లినట్లు సమాచారం. కూటమి నేతలకు స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ తరలింపుపై ఉన్న శ్రద్ధ, బ్యారేజీ నిర్మాణంపై లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బ్యారేజీ నిర్మిస్తే సుభిక్షమే!

నీలం సంజీవరెడ్డి హయాంలో నిర్మించిన ఆనకట్ట ప్రదేశంలో బ్యారేజీ నిర్మిస్తే అంతా సుభిక్షంగా ఉంటుందని స్థానికులు, రైతులు అభిప్రాయపడుతున్నారు. బ్యారేజీ నిర్మాణానికి రూ.58.40 కోట్ల జైకా నిధులతో టెండర్లు కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం 8 వేల ఎంసీఎఫ్టీల నీటి నిల్వలున్న నదిలో పనులు పూర్తయితే 25 వేల ఎంసీఎఫ్టీల మేర నీటి నిల్వలు ఉండే అవకాశ ముంది. దీంతో స్వర్ణముఖి పరివాహక ప్రాంతం సుభిక్షమవుతుంది.

అఘోరీ కారు తనిఖీ



అఘోరీతో మాట్లాడుతున్న సీఐ తిమ్మయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: తడ నుంచి శ్రీకాళహస్తికి వెళ్తున్న అఘోరీ కారును గురువారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సీఐ తిమ్మయ్య, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు అడ్డుకుని సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. అఘోరీ ఒంటిపై బట్టలు లేకపోవడంతో శాలువ ఇచ్చి కట్టుకోమని ఒప్పించి, కట్టుకున్న తర్వాత కిందకు దించి, కారును తనిఖీ చేశారు. కారులో పెట్రోల్, ఎలాంటి ఇబ్బంది కరమైన వస్తువులు తనిఖీలో కనబడ లేదు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి బట్టలు ధరించి వెళ్తానని తెలిపినట్టు సీఐ వెల్లడించారు.

అగ్ని ప్రమాదం



రాపూరు: రాపూరు మండలం, బొజ్జనపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఫ్యాక్టరీలో గురువారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఫ్యాక్టరీలో ఉన్న చెత్తపై కప్పిన పట్ట, దానిపై ఉన్న పాత టైర్లు తొలగిస్తున్నప్పుడు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో దట్టమైన పొగలు వ్యాపించాయి. చుట్టుపక్కల గ్రామాల పరిధిలోని ప్రజలు తీవ్ర భయాందోళన గురయ్యారు. అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే ఎలాంటి ఆస్తినష్టం జరగలేదని సమాచారం.

హాంఫట్!

- ఏపీఐఐసీకి చెందిన మూడెకరాల భూమి ఆక్రమణ
- పోలి గ్రామంలో ఘటన
- కన్నెత్తి చూడని రెవెన్యూ
- రెచ్చిపోతున్న టీడీపీ నేతలు



టీడీపీ నాయకులు చదును చేసిన ప్రభుత్వ భూమి

శ్రీకాళహస్తి రూరల్: ప్రభుత్వ భూమిపై టీడీపీ నేతల కన్ను పడింది. ఇక ఆలస్యం ఎందుకని అనుకున్నారేమో జేసీబీలు పెట్టి మూడు ఎకరాల వరకు చదును చేశారు. ఆపై గెనాలు వేసుకుని నీకింత నాకింత అని వాటాలు పంచుకున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో విమర్శలకు తావిస్తోంది. వివరాలు.. శ్రీకాళహస్తి మండలం, పోలి గ్రామ రెవెన్యూ లెక్క దాఖల, సర్వే నం.220, 221లోని ప్రభుత్వ భూమిని స్థానిక టీడీపీ నాయకులు రెండు రోజుల క్రితం జేసీబీలు పెట్టి చదును చేశారు. గెనాలు కూడా ఏర్పాటు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా స్పందన లేదు.

గతంలో ఏపీఐఐసీకి 150 ఎకరాల అప్పగింత

గత కాంగ్రెస్ పాలనలో 150 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏపీఐఐసీకి కేటాయించారు. కానీ ఆ భూమిని ఇప్పటివరకు స్వాధీనం చేసుకోలేదు. ప్రస్తుతం అదే భూమిపై టీడీపీ నేతల కన్నుపడింది. కొంచెం కొంచెం స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇదే సర్వే నంబర్లలో జగనన్న ఇళ్ల పట్టాలు ఇవ్వాలని స్థానికులు కోరగా.. అప్పటి రెవెన్యూ అధికారులు, స్థానిక టీడీపీ నేతలు అడ్డుపడ్డారు. ఇప్పుడు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నా రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాల్సి ఉంది.

> **చర్యలు తీసుకుంటాం**
>
> ప్రభుత్వ భూమి ఆక్రమణ విషయం తన దృష్టికి రాలేదు. తక్షణమే మా సిబ్బందిని పంపించి పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
>
> – లక్ష్మీనారాయణ, తహసీల్దార్, శ్రీకాళహస్తి

20 కిలోల గంజాయి స్వాధీనం

- నలుగురి అరెస్ట్
- అరెస్టయిన వారు 25 ఏళ్లలోపు వారే
- వ్యసనాలకు బానిసై బతుకులు సర్వనాశనం



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

తడ: అక్రమంగా తమిళనాడుకు గంజాయి తరలిస్తున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి 20.8 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు గురువారం ఆ వివరాలను వెల్లడించారు. రహస్య సమాచారం మేరకు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, తడ ఎస్‌ఐ కొండపనాయుడు తన సిబ్బందితో శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద నిఘా పెట్టి తనిఖీలు చేపట్టినట్టు వెల్లడించారు. వివిధ రకాల బ్యాగులతో అనుమానాస్పదంగా ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని బ్యాగులను పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్టు గుర్తించామన్నారు. 20.8 కిలోల గంజాయి పట్టుబడగా.. దీని విలువ రూ.3 లక్షలుంటుందని డీఎస్పీ తెలిపారు. నిందితులు తమిళనాడుకు చెందిన దేవరాజ్, నరేష్, హరిహరమార్సన్ తోపాటు కర్ణాటకకు చెందిన నారాయణ ఉన్నట్టు వెల్లడించారు. నిందితులంతా పాతికేళ్లలోపువారేనని, చెడు వ్యసనాలకు, ప్రలోభాలకు ఆకర్షితులై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. దితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని అభినందించి వారికి రివార్డు కోసం రెఫర్ చేసినట్టు వెల్లడించారు. డీఎస్పీతోపాటు సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ కొండపనాయుడు ఉన్నారు.

పాముకాటుకు గురైన ఉపాధి కూలీ



కృష్ణారెడ్డిని తిరుపతి తరలిస్తున్న దృశ్యం

చంద్రగిరి: ఉపాధి కూలీని పాము కాటువేసిన ఘటన గురువారం మండల పరిధిలోని కొత్తశానంబట్ల చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కొత్తశానంబట్లకు చెందిన కృష్ణారెడ్డి గురువారం ఉపాధి కూలి పనుల నిమిత్తం తోటి కూలీలతో కలసి గ్రామ శివార్లలో పనికివెళ్లాడు. ఈ క్రమంలో చెట్టు వద్ద చెత్తచెదారాలను శుభ్రం చేస్తుండగా పాము కాలిపై కాటేసింది. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడిని తోటి కూలీలు, హుటాహుటిన ప్రైవేటు వాహనంలో చంద్రగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి నుంచి 108 వాహనంతో తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అనంతరం కుటుంబ సభ్యులు రేణిగుంటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ప్రస్తుతం కృష్ణారెడ్డి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

వసతి గృహం వంట గదికి తాళం

– నెలల తరబడి అద్దె చెల్లించని అధికారులు



వంట గదికి తాళం వేసి ఉన్న వైనం, కృష్ణయ్య అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో అసంపూర్తిగా నిర్మించి ఉన్న అద్దె భవనంలో సాగుతున్న వంట గదికి యజమాని గురువారం తాళం వేశారు. ఈ భవనానికి నెలల తరబడి అద్దె చెల్లించకపోవడంతో ఖాళీ చేయాలని అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదు. ఇక చేసేది లేక భవన యజమాని గురువారం వంట గదికి తాళం వేశారు. అధికారుల తీరుపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని భవన యజమాని తెలిపారు. దీనిపై వార్డెన్ శ్రీనివాసులు సీఐ బాబీకి ఫిర్యాదు చేశారు. పోలీసులు తాత్కాలికంగా వంట గదికి తాళం తెరిపించారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

రేణిగుంట: మండలంలోని కరకంబాడి హైస్కూల్‌లో చోరీకి పాల్పడిన వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రేణిగుంట అర్బన్ ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నాలుగు రోజుల కిందట కరకంబాడి హైస్కూల్ ఆఫీసులో ఉన్న బీరువా తాళాలు పగులగొట్టి రూ.1లక్ష విలువైన ఫర్నిచర్‌ను ధ్వంశం చేసినట్లు హెచ్‌ఎం ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టామన్నారు. సాంకేతిక పరిజ్ఞాన సహకారం తీసుకుని వేలిముద్రలను సేకరించి దొంగతనానికి పాల్పడిన వ్యక్తి శ్రీకాళహస్తికి చెందిన పటాన్ గౌస్ బాషా(65)ను గురువారం రేణిగుంట పాత చెక్‌పోస్ట్ వద్ద అరెస్ట్ చేసినట్టు వెల్లడించారు. ఇతనిపై ఇప్పటికే తిరుపతి పరిసర ప్రాంతాలలో సుమారు 30 చోరీ కేసులున్నట్లు తెలిపారు. నిందితుడ్ని తిరుపతి కోర్టుకు తరలించినట్లు ఆయన వివరించారు.


ప్రభుత్వ భూమిని అమ్మేస్తున్నారు

ప్రభుత్వ భూముల్లో అక్రమార్కుల కబ్జాల పర్వం కొనసాగిస్తున్నా.. అక్రమ విక్రయాలు, అనధికార భవన నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులకు కనిపించడం లేదు. దీంతో పుత్తూరు మండంలోని మజ్జిగగుంటలో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు, స్థలాలు అక్రమార్కుల పరమవుతున్నాయి.

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- తిరుపతి– చెన్నై జాతీయ రహదారి పక్కనే ఆక్రమణల పర్వం
- రూ.కోట్ల విలువజేసే ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా ప్లాట్లు, ఇంటి నిర్మాణాలు
- ఉన్నతాధికారులైనా స్పందించాలని కోరుతున్న గ్రామస్తులు



మజ్జిగగుంట వద్ద అక్రమ నిర్మాణాలు



2023లో 1బీ లో ఫ్రీహ్యాండ్‌గా నమోదు

పుత్తూరు: ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాల్లో యథేచ్ఛగా ప్లాట్లు వేసి విక్రయిస్తున్నా.. అనుమతి లేకుండానే భవనాలు కడుతున్నా పుత్తూరు మండలంలోని రెవెన్యూ అధికారులకు కనిపించడం లేదు. పుత్తూరు మండలంలోని తడుకు రెవెన్యూ మజ్జిగగుంట వద్ద గల ప్రభుత్వ భూముల్లో అక్రమార్కులు ప్లాట్లు వేసి విక్రయిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. ఆ భూముల్లో స్థలాలు కొన్నవారు పక్కా భవనాలు కట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సర్వే నంబర్ 6/5, 6/4 లోని ఒక ఎకరా భూమి వివిధ రూపాంతరాలు పొంది అక్రమార్కులకు కాసుల పంట పండిస్తోంది. తిరుపతి–చెన్నై జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సదరు భూమి రూ.కోట్లు విలువ చేస్తుంది. పాతికేళ్ల కిందట తడుకు గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులైన కె.సామయ్య, కె.వెంకటరత్నం ఇద్దరూ చెరో 50 సెంట్లు చొప్పున ఈ భూమిలో డీకేటీ పట్టాలు పొందారు. కొంతకాలం తర్వాత వారు వ్యవసాయం చేయకుండా ప్లాట్లు వేసి విక్రయించడంతో కొందరు రెవెన్యూ శాఖకు ఫిర్యాదు చేశారు. 2005లో దీనిపై విచారణ చేపట్టిన అప్పటి పుత్తూరు తహసీల్దారు కరుణకుమారి వారికి ఇచ్చిన పట్టాలను రద్దు చేసి, ఆ భూమిలో 2008లో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా తడుకు దళితవాడకు చెందిన అంకమ్మతో పాటు మరికొంతమంది పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునే సమయంలో ఈ భూమి తనదేనంటూ వెంకటరత్నం అడ్డుకున్నాడు. దీంతో ఇంటి పట్టాలు పొందిన అంకమ్మతో పాటు మరో పది మంది కోర్టును ఆశ్రయించారు. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు సదరు భూమిని రెవెన్యూ శాఖవారు స్వాధీనం చేసుకోవాలని 2017లో ఉత్తర్వులు ఇచ్చింది. అప్పటి నుంచి ఈ భూమిలోకి ఎవరూ వెళ్లలేదు. ఇటీవల కొందరు వ్యక్తులు సదరు భూమిలో ప్రవేశించి ప్లాట్లు వేసి, నిర్మాణాలు చేపడుతున్నారు. ఇలా రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి పరులపాలు కావడానికి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమే కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

> **పూర్తిగా సర్వే చేయాలి..**
>
> 
>
> తడుకు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 6/5, 6/4లతో పాటు దీని వెనుకభాగంలో ఉన్న ప్రభుత్వ భూమిని పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాలి. ప్రభుత్వ భూమి మొత్తం ప్రభుత్వ అవసరాలకు, పేదల ఇంటి స్థలాలకు కేటాయించాలి. రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం కారణంగానే నేడు మళ్లీ ఆక్రమణదారులు సదరు భూమిలోకి ప్రవేశిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించాలి.
>
> – మునికుమార్, తడుకు దళితవాడ, పుత్తూరు మండలం

> **దళితులకు ఇంటి పట్టాలు ఇవ్వాలి**
>
> 
>
> మజ్జిగ గుంట వద్ద ఉన్న ప్రభుత్వ భూమిలో నిరుపేదలైన దళితులకు ఇంటి పట్టాలు ఇవ్వాలి. గతంలో తడుకు దళితవాడలోని 20 మందికి పైగా ఇంటి స్థలాలు లేవని రెవెన్యూ అధికారులే ప్రభుత్వానికి నివేదించారు. ఇప్పటికైనా పట్టాలు లేనివారికి ఇంటి పట్టాలు కేటాయించాలి.
>
> – కె.గీత, తడుకు దళితవాడ, పుత్తూరు మండలం

> **రెవెన్యూ అధికారుల బరితెగింపు**
>
> 
>
> కె.సామయ్య పేరిట ఇచ్చిన డీకేటీ పట్టాను 2005లోనే రెవెన్యూ శాఖ రద్దు చేసింది. అతను పదేళ్ల క్రితమే చనిపోయాడు. 2003లో మళ్లీ రద్దు చేసిన భూమిని చనిపోయిన కె.సామయ్య పేరిట 1బిలో అసైన్డ్ ల్యాండ్ ఫ్రీ హ్యాండ్‌గా అప్‌లోడ్ చేయడం రెవెన్యూ అధికారుల బరితెగింపు. ఇలా చేసిన అప్పటి వీఆర్‌ఓ, ఆర్‌ఐ, తహసీల్దార్లను సస్పెండ్ చేయాలి. తడుకు రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని సర్వే చేసి అధికారులు స్వాధీనం చేసుకోవాలి.
>
> – కె.మురగారెడ్డి, కార్యదర్శి, సమాచార హక్కుల వేదిక, పుత్తూరు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> 
>
> డీకేటీ పట్టా రద్దు చేసి ఉంటే మళ్లీ సదరు వ్యక్తులు అందులో ప్రవేశించడానికి వీలులేదు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే తక్షణం నిలుపుదల చేస్తాం. సదరు భూమిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.
>
> – జి.సి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు